హైదరాబాద్
మంగళవారం-17
నవంబర్-2026

పేజీలు-8

balagamtv100@gmail.com

బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

మీడియా రంగంపై సమగ్ర అధ్యయనానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- సోషల్ మీడియా సవాళ్లను ఎదుర్కొంటూ వాస్తవ, విశ్వసనీయ వార్తలు అందించాలి: ప్రొఫెసర్ కోదండరాం
- జాతీయ పత్రికా దినోత్సవ వేడుకల్లో వక్తల అభిప్రాయం





హైదరాబాద్, నవంబర్ 16 : మారుతున్న మీడియా పరిస్థితులు, సోషల్ మీడియా విస్తృతి, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడి యా సంస్థల సవాళ్లపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా మీడి యా కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు ప్రభు త్వాన్ని కోరారు. సోషల్ మీడియా వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ప్రజలకు కచ్చి తమైన, వాస్తవాధారిత, విశ్వసనీయ వార్తలను వేగంగా అందించాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదం డరాం పేర్కొన్నారు.నాంపల్లిలోని మిగతా 3లో..

దేశాన్ని లూటీ చేయ్.. కార్పొరేట్లకు దోచిపెట్టు





- మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానమిదే
- దేశంలో భూసంస్కరణలు అమలు చేసింది కమ్యూనిస్టు ప్రభుత్వాలే
- అమెరికా సామ్రాజ్యవాదాన్ని అమలు చేస్తున్న మోడీ
- ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీల విస్మరణ
- దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలను బలోపేతమవ్వాలి
- ఏఐకేఎస్ జాతీయ పధాన కార్యదర్శ విజూకృష్ణన్

దేశాన్ని లూటీచేయ్.. కార్పొరేట్లకు దోచిపెట్టు అన్నట్టుగా కేంద్రంలోని బీజేపీ పాలనా విధా నం ఉం దని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శిం చారు. అమెరికా సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా ఆ దేశాధ్యక్షులు ట్రంప్ చెబుతున్న విధానా లన్నింటినీ కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును వివరించారు. నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్ (జీఎమ్ గౌడ్ కన్వెన్షన్‌హాల్)లోని అచ్యుతా నందన్ హాల్‌లోని శంకరయ్య వేదికగా జరుగుతున్న ఏఐకేఎస్ జాతీయ 36వ మహాసభలో విజూ కృష్ణన్ మాట్లాడారు. అమెరికా, న్యూజి లాండ్, యూరో పియన్ యూనియన్, తదితర దేశాలతో మన దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా మోడీ సర్కారు చేసుకుం టున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు దేశ ఆర్థిక సమగ్రతకే ప్రమాదకరమని హెచ్చరించారు. మిగతా 4లో..

NHMలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాల్సిందే




- ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదు?
- ప్రతినెల 1నే జీతాలివ్వాలి
- సమ్మె కాలానికి వేతనాన్ని పూర్తిగా చెల్లించాలి
- లేనిపక్షంలో ఉద్యోగుల పక్షాన ఉద్యమిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 16 : ఇచ్చిన హామీ ప్రకారం నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమ్మె కాలంలో నిలిపివేసిన వేతనాన్ని పూర్తిగా చెల్లిం చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యో గుల పక్షాన తాము ఉద్యమిస్తామని హెచ్చరిం చారు. ఈరోజు పలువురు ఎన్ఎహెచ్ఎం ఉద్యోగ సంఘం జేఏసీ అధ్యక్షులు రమేశ్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కరీంనగర్‌లోని తన నివాసంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసి వినతి పత్రం అందించారు. చీఎంపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులందరికీ 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని, జీవో నెం 60ను అమలు చేయడంతోపాటుజీవో మిగతా 3లో..

నాగార్జున సాగర్‌పై ఏపీ కన్ను!

- భారీ టన్నెల్‌తో కృష్ణా జలాల తరలింపునకు చంద్రబాబు సర్కార్ ప్రణాళిక?
- అమరజీవి జలపథకం పేరుతో భారీ సొరంగం నిర్మాణానికి సన్నాహాలు
- రూ.1,200 కోట్లతో తొలి దశ పనులు.. 460 అడుగుల నీటిమట్టం నుంచే గ్రావిటీ ద్వారా తరలించేలా డిజైన్?
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు తాగునీటి సరఫరా లక్ష్యం.. భవిష్యత్తులో సాగునీటి అవసరాలకూ వినియోగించే అవకాశం ఉందన్న అనుమానాలు
- ఏపీ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ మౌనం.. కేంద్రం అండగా ఉన్నా స్పందించని తెలంగాణ బీజేపీ నేతలు
- కృష్ణా జలాల హక్కులకు ముప్పు పొంచి ఉందని సాగర్ ఆయకట్టు రైతుల ఆందోళన
- విజయపురి సౌత్ వద్ద భారీ టన్నెల్ నిర్మాణానికి ప్రణాళిక



హైదరాబాద్, నవంబర్ 16 : నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. విజయపురి సౌత్‌లో నాగార్జున సాగర్ డ్యామ్ కుడివైపు ముందు భాగంలో 'అమరజీవి జలపథకం' పేరుతో భారీ సొరంగం నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం సన్నా హాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే జలాశయంలో నీటిమట్టం 460 అడుగుల డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోయినా గ్రావిటీ ద్వారా నీటిని ఏపీకి తరలించే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తాగునీటి పేరుతో.. భవిష్యత్తులో సాగునీటికీ?

ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రధానంగా తాగునీటి పథకంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, భవిష్యత్తులో

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్లు, అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు
- డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు



హైదరాబాద్, నవంబర్ 16 : తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమవారం జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ క్రీడల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మిగతా 4లో..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం
- ఎల్కతుర్తి మండలంలో 715 మందికి కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందించిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్
- మహిళా సంక్షేమం, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట - మంత్రి పొన్నం ప్రభాకర్
- మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే లక్ష్యం - మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 16 : ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హు లైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియో జకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రొసీడిం గ్స్‌ను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో నూతన పింఛన్ల లబ్ధిదారులు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 200 మిగతా 3లో..

చేయూత పింఛన్లు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం



- అక్కన్నపేట మండలంలో 567 కొత్త పింఛన్లు మంజూరు - మంత్రి పొన్నం ప్రభాకర్
- అక్కన్నపేట మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా 7 రకాల పింఛన్ల కింద 4.64 లక్షల కొత్త పింఛన్లు మంజూరు
- మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.79 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాం

హైదరాబాద్, నవంబర్ 16 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూరి, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం 7 రకాల పింఛన్ల కింద 4.64 లక్షల కొత్త పింఛన్లను మంజూరు చేసిందని తెలిపారు. అక్కన్నపేట మండలంలో ఇప్పటికే 5,818 పింఛన్లు ఉండగా, అదనంగా మరో 567 కొత్త పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. ఎల్కతుర్తి మండలంలో 715 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు.ఇంకా పింఛన్లు అందని ఒంటరి మహిళలు,

రైలు కార్యకలాపాల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సమీక్ష

భద్రతా నిబంధనల అమలులో నిర్లక్ష్యం వద్దు: జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



హైదరాబాద్, నవంబర్ 16 : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రై లు కార్యకలాపాల భద్రతను మ రింత పటిష్టం చేయడంపై జన రల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సమీక్ష నిర్వహించారు. సికింద్రాబా ద్‌లోని రైల్ నిలయంలో వివిధ శాఖల ప్రధానాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా భద్రతా పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ రాజేష్ పి. ఖాడే, వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, రైల్వేలో నిర్దేశించిన అన్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. భద్రతా పరికరాల పనితీరును మిగతా 3లో..

2014కు ముందు ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఊరట

- పట్టా/పొజిషన్ సర్టిఫికేట్ల వాపస్‌కు ఆదేశాలు
- 7లక్షల మందికి చేకూరనున్న ప్రయోజనం
- దశాబ్దకాలపు నిరీక్షణకు తెరదించిన ప్రజా ప్రభుత్వం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, నవంబర్ 16 : దశాబ్దాలుగా పేదలు కన్న సొంతింటి కలను సాకారం చేస్తూ వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు గతంలో జారీ చేసిన పట్టాలను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కును మరింత భద్రం చేస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం లక్షలాది పేద కుటుంబాలకు ఊరటనివ్వనుందన్నారు. గతంలో అమలు చేసిన విధానం ప్రకారం మిగతా 4లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మల్కాజిగిరి జోనల్‌లో ప్రజావాణి



- 18 ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, నవంబర్ 16 :

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు చెందిన ప్రజల నుంచి మొత్తం 18 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.

సాంకేతిక రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా భారత్ ఎదగాలి

- రక్షణ రంగంలో స్వావలంబనకు అధునాతన సాంకేతికత కీలకం
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



హైదరాబాద్, నవంబర్ 16 :

సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా ఎదగాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన సామర్థ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.15వ అంతర్జాతీయ ఏరో ఎన్‌డీటీ 2026 సింపోజియంను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రక్షణ రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, స్వదేశీ పరిజ్ఞానా నికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 2,000 మంది సాంకేతిక నిపుణులు, పరిశోధకులు హాజరవుతున్నారు. ఈ సదస్సు ద్వారా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చలు, పరిశోధనలకు కొత్త అవకాశాలు లభించనున్నాయి.

డిసెంబర్ 7న రైతు భరోసా నిధుల జమకు సన్నాహాలు!



- తొలుత రెండు ఎకరాల వరకు ఉన్న రైతులకు నిధులు విడుదల చేసే యోచన

హైదరాబాద్, నవంబర్ 16 : తెలంగాణ రైతులకు రైతు భరోసా నిధుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్లు పూర్తి చేసుకునే సందర్భంగా డిసెంబర్ 7న రైతు భరోసా నిధులను జమ చేసేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.తొలుత రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. విడతల వారీగా నిధులు జమ చేసే అవకాశాలపైనా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.అయితే నిధుల విడుదల తేదీ, అర్హులైన రైతుల వివరాలు, చెల్లింపు విధానంపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రైతులు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

టీజీపీఎస్సీ ద్వారా 102 గణాంకాధికారి పోస్టుల భర్తీ



- నవంబర్ 27 దరఖాస్తుకు చివరి తేదీ..
- జనవరి 2027లో రాత పరీక్షకు అవకాశం

హైదరాబాద్, నవంబర్ 16 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 102 పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది. రాష్ట్ర ఆర్థిక, గణాంకాల శాఖలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులను భర్తీ చేయనుంది.ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలతో పాటు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.ఈ నియామకాలకు సంబంధించిన రాత పరీక్ష 2027 జనవరిలో నిర్వహించే అవకాశం ఉంది. ఎంపికైన అభ్యర్థులకు రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు పే స్కేల్ వర్తించనుంది.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. పూర్తి అర్హతలు, నిబంధనలు, పరీక్ష వివరాలను అధికారిక టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌లో పరిశీలించాలి.

ప్రకృతి మిత్రులుగా మారి ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొందాం!

- ప్రతి నీటి బొట్టును భవిష్యత్తు కోసం ఒడిసిపట్టాలి
- ఆర్ఓ వ్యర్థ జలాలను ఇతర అవసరాలకు వినియోగించుకోవాలి
- విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై గుండేటి యోగేశ్వర్, సంపత్ పిలుపు







హైదరాబాద్, నవంబర్ 16 :

ప్రకృతి వనరులను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరూ ప్రకృతి మిత్రులుగా మారాలని, పెరుగుతున్న ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు పర్యావరణ హిత అలవాట్లను జీవన విధానంలో భాగం చేసుకోవాలని ప్రకృతి మిత్ర తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్, నాగోల్ మున్సిపల్ కమిషనర్ సంపత్ పిలుపునిచ్చారు. ప్రతి నీటి బొట్టును భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయాలని, ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఆర్ఓ ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థ జలాలను ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు.ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, జలవనరుల పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం నాగోల్‌లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి మిత్ర తెలంగాణ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుండేటి యోగేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవుడి స్వార్థపూరిత చర్యలు, ప్రకృతి వన రుల విచ్చలవిడి వినియోగం, పర్యావరణ విధ్వంసం కారణంగా భూతాపం పెరుగుతోందని పేర్కొన్నారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరి తల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకుంటున్న అసాధారణ మార్పులు ఎల్‌నినో పరిస్థితులకు కారణమవుతున్నాయని వివరించారు. విపత్కర పరిస్థితుల తీవ్రతను తగ్గించాలంటే ప్రతి పౌరుడు ప్రకృతి పరిరక్షణలో భాగస్వామి కావాలని కోరారు. భారత రాజ్యాంగం, పర్యావరణ చట్టాలు, నీరు--చెట్టు--నేల పరిరక్షణకు సంబంధించిన వాల్టా చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవ హరించా లని సూచించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటి విని యోగంలో పొదుపు పాటించాలని తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ, మొక్కల పెంపకం వంటి ప్రకృతి మిత్ర అలవాట్లను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎల్‌నినో, వాతావరణ మార్పులపై రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హైదరా బాద్, రంగారెడ్డి జిల్లాల ప్రకృతి మిత్ర సభ్యులు, విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో ఓన్పార్తినిచ్చారు.ఖాదీ గ్రామీణ పరిశ్రమల పూర్వ అధికారి మెరుగు భూమయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎం. సుధాకర్, జిల్లా విశ్రాంత పరిశ్రమల అధికారి పద్మభూషణ్ రాజు, సివిల్ ఇంజనీర్ మాటేటి లక్ష్మీనా రాయణ, ప్రకృతి మిత్ర మహిళా కార్యదర్శి ఎం. విజయలక్ష్మి రాజు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావాలు, ప్రకృతి పరిరక్షణపై వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి పౌరుడు సహజ వనరులను పొదుపుగా వినియోగించు కోవడంతో పాటు వివిధ సందర్భాల్లో మొక్కలు నాటి అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు.పాఠశాల గ్రీన్ క్లబ్ విద్యార్థి ఆదర్శ్ ప్రకృతి గీతాలతో, సాయినిధి పర్యావరణ పరిరక్షణ సందేశంతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రకృతి మిత్ర ప్రతినిధులను ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, రాజవర్ధన్, జయప్రద, పద్మ, కవిత, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు దోహదం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, నవంబర్ 16 :

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే వేలాది మంది వినియోగదారులు, వ్యాపారులకు కెమెరాల ఏర్పాటుతో భద్రత కలుగుతుందన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించి పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కెమెరాలు ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ సభ్యులను అభినందించారు.అనంతరం మార్కెట్‌లో ఎమ్మెల్యే పర్యటించి వ్యాపారులను పలకరించారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు గందే నాగులు, తలసాని స్కైలాబ్ యాదవ్, కొండాపురం మహేష్ యాదవ్, మార్కెట్ కమిటీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జయరాజ్, మహేందర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి





హైదరాబాద్, నవంబర్ 16 :

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి.. క్షేత్రస్థాయిలో పర్యటనలు..అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలి..మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని,అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ మంత్రి మహేశ్వరం నియోజక వర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి సర్కిల్ షాహిన్ నగర్ డివిజన్ పరిధిలోని అబూబకర్ కాలనీ, క్యూబా కాలనీలలో రూ.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం నబిల్ కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసులతో కలిసి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు.మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వం పేరుతో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వెంకట్రాం,డిఈ ఆయేషా, సీని యర్ నాయకులు ఖైసర్ బాం,మాజీ ప్రజాప్రతినిధులు యాతం పవన్ కుమార్ యాదవ్, షేక్ అఫ్జల్,పల్లపు శంకర్,బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్,యూత్ వింగ్ అధ్యక్షులు యంజాల అర్జున్, నాయకులు అలీ మన్సూరి, బదర్ హుసేని, బర్కత్ అలీ, కొంగర సుభాస్,జావేద్, ముక్తుం పటేల్, అబ్బాస్,సోషల్ మీడియా ఇన్చార్జి,మాజీ ఆర్మీ మెన్ వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

- సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ చర్యలు
- చార్మినార్ జోన్ పరిధిలోని ప్రజలు సమస్యలను ప్రజావాణిలో తెలియజేయాలి..
- జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ



హైదరాబాద్, నవంబర్ 16 :

ప్రజావాణి కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నట్లు జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ తెలిపారు. సోమవారం చాంద్రా యణగుట్ట నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటవరకు ఈ కార్యక్రమం కొనసాగింది.ఈ సంద ర్భ ంగా కమిషనర్ మాట్లాడుతూ.. మలక్‌పేట్, సంతోష్‌నగర్, మూసారంబాగ్, యాకుత్‌పురా, చార్మినార్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, జోనల్ ఏఎంసీ రాజారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కాలనీల్లో అనుమానితుల హాల్ చల్



- కాలనీలో అనుమానాస్పద కదలికలు..
- కాలనీ వాసుల్లో ఆందోళన

హైదరాబాద్, నవంబర్ 16 :

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్‌లోని బీపీఎం గ్రీన్‌ల్యాండ్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున అనుమానాస్పద వ్యక్తుల కదలికలు నివాసితుల్లో ఆందోళనకలిగించాయి. ఆదివారం సుమారు తెల్లవారుజాము 3గంటల సమయంలో ముసుగులు ధరించిన నలుగురువ్యక్తులు కాలనీలో సంచరిస్తూ ఇళ్ల పరిసరాలను పరిశీలిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డయ్యాయి. అనుమానితుల్లో ఒకరు ఒక ఇంటి గేటు ఎక్కి లోపలికి తొంగిచూస్తున్న దృశ్యం కెమెరాల్లో రికార్డు అయింది. ఇది తెలుసుకున్న కాలనీ వాసులు రాత్రి వేళ ఇళ్ల భద్రత గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.అనుమానితుల ఆచూకీని వెంటనే గుర్తించాలని పోలీసులను కోరుతున్నారు.కాలనీల్లో రాత్రి వేళ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.నివాసితులు రాత్రి వేళ ఇళ్ల గేట్లు, తలుపులు బాగా బందుకోవడం, సీసీ కెమెరాలు, లైటింగ్ సరిగా పనిచేసేలా చూసుకోవడం, అపరిచితుల కదలికలుకనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించడంవంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో కాలనీ భద్రతపై పోలీసుల దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

ప్రతి ఇంటా ఉసిరి..ప్రతి గుడిలో బిల్వం

- నల్ల పోచమ్మ ఆలయంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, నవంబర్ 16 :

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రతి ఇంటా ఉసిరి -- ప్రతి గుడిలో బిల్వం' కార్యక్రమంలో భాగంగా నాచారం నల్ల పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో ఉసిరి, బిల్వం మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు, మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ నుతికడి భోజనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంట్లో, ప్రతి ఆలయంలో, ప్రతి పాఠశాలలో ఉసిరి, బిల్వం మొక్కలు నాటి సంరక్షించేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మన సనాతన సంప్రదాయాల్లో విశిష్ట స్థానం కలిగిన ఉసిరి, బిల్వ వృక్షాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్తీకమాసంలో ఈ వృక్షాలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణలోనూ ప్రత్యేక స్థానం ఉందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్య తగా భావించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందిం చడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సంపాదకీయం

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణ మీడియా అకా డమీ కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జ ర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), తెలంగాణ మీడియా అకాడమీ సం యుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలునిర్వహించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీని వాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్ర ముఖులు,సీనియర్ జర్నలిస్టులు పాల్గొని జర్నలిజం ఎదుర్కొ ంటున్న సవాళ్లు, బాధ్యతలపై అభిప్రాయాలు వెల్లడించారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ప్రధాన మీడియా

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా మీడియా రంగంలో మార్పులు, సమీకరణలు అవసరమన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు క్రమంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుండటంతో సోషల్ మీడియా ప్రజలకు చేరువవుతోం దని తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వాధినేతల మద్దతు పొందడానికే ప్రాధాన్యత ఇస్తూ అసలు వార్తల స్వరూపాన్ని మార్చేస్తున్నాయని విమర్శించారు.సంచలన కథనాలకే ప్రాధాన్యత ఇవ్వకుండా సమాజానికి ఏది అవసరం? ప్రజలకు ఎలాంటి సమాచారం అందించాలి? వార్తల వల్ల సమాజానికి ఎంత మేలు జరుగుతోంది? అనే అంశాలను మీడియా సంస్థలు ఆలోచించాలని సూచించారు. వార్తల్లో కచ్చితత్వం, వాస్తవికత, వేగం సమపాళ్లలో ఉండాలని స్పష్టం చేశారు.

ప్రజల పక్షాన నిలవడమే జర్నలిజం బాధ్యత

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది జాతీయ పత్రికా దినోత్సవం సంద ర్భంగా 'జర్నలిజం: పాపులిస్ట్ లేదా రెస్పాన్సిబుల్?' (Journalism: Populist or Responsible?) అనే అంశంపై చర్చిస్తున్నట్లు తెలిపారు. మీడియా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలవాలని, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వసనీయతను కాపాడుకోవడానికి కచ్చితమైన సమాచారం, నైతిక విలువలతో కూడిన వార్తా సేకరణ ఎంతో ముఖ్యమన్నారు.దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. పాత్రికేయ ప్రమాణాలను కాపాడటంతో పాటు మీడియా సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞానవంతమైన, పారదర్శక సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని, పాత్రికేయ రంగ భవిష్యత్తు స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టులు మీడియా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

మీడియా స్వేచ్ఛను కాపాడాలి

ప్రొఫెసర్ కె. హరగోపాల్ మాట్లాడుతూ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్వతంత్ర సంస్థగా కొనసాగుతూ జర్నలిజంలో ఉన్నత ప్రమాణాల పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. మీడియాపై బెదిరింపులు వచ్చినప్పుడు జర్నలిస్టులకు అండగా నిలవడం కూడా ఆ సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వాలు మీడియాను నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నాయని, జర్నలిస్టులపై వివిధ రకాల ఒత్తిళ్లు తీసుకు వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం మీడియా సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నాలు జరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు వృత్తిపరమైన క్రమశిక్షణను అలవర్చుకుని, నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అప్పుడే సమాజంలో పాత్రికేయులకు గౌరవం పెరుగుతుందని అన్నారు.

ప్రెస్ కౌన్సిల్ ఆవిర్భావంపై గుర్తుచేసుకున్న వక్తలు

1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటు కావడంతో ఆ రోజును జాతీయ పత్రికా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని వక్తలు గుర్తుచేశారు. అంతకుముందు తొలి ప్రెస్ కమిషన్ ఏర్పాటు, వర్కింగ్ జర్నలిస్టులు, వార్తాపత్రికలకు సంబంధించిన చట్టాల రూపకల్పనలో అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సూచనలు కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె. రామచంద్రమూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్య, ఎన్. వేణుగోపాల్, కె. సాజయ్య, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారా యణ, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాల్సిందే

నెం.1195 ప్రకారం వేతనాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ (ఎన్ హెచ్ఎం) పరిధిలోకి తీసుకురావాలి. ఎన్ హెచ్ఎం విధానం ద్వారా జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అట్లాగే ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ పీఆర్సీ ప్రయోజనాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా సమ్మె కాలానికి పూర్తి వేతనాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ హామీలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, 90 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందునే సమ్మెను విరమించామని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆయా ఉద్యోగుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులున్నారు.

భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సమీక్ష

సంబంధిత విభాగాలు సమన్వయంతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.యార్డులు, బ్లాక్ సెక్షన్లలో పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కేబుల్ కట్ ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైలు పట్టాల సమీపంలో భద్రతా తనిఖీలు నిర్వహించాలని, నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.జోన్ పరిధిలో రైళ్ల రాకపోకలు సురక్షితంగా, సజావుగా సాగేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైల్వే సిబ్బంది అందరిలో భద్రతపై అవగాహన పెంపొందించాలని, విధి నిర్వహణలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అర్హులైన పేదలకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని వివరించారు.మహిళా సంఘాలను బలోపేతం చేసి అక్కాచెల్లెళ్లందరినీ ఆర్థికంగా అభివృద్ధి చేసి కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పదేళ్ల అప్పుల భారం ఉన్నప్పటికీ పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, కొత్త సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేశామని, ఇందులో 2,77,894 మంది వితంతువులు, 1,00,224 మంది దివ్యాంగులు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులు, 53,844 మంది ఒంటరి మహిళలు ఉన్నారని వివరించారు.ఎల్కతుర్తి మండలంలో ఇప్పటికే 5,850 మంది నెలవారీ పింఛన్లు పొందుతుండగా, తాజాగా మరో 715 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 5,230 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులెవరూ పింఛన్లకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పింఛన్ల పరిశీలనలో లోపాలు ఉంటే ప్రత్యేక అధికారుల ద్వారా 380 కోణాల్లో పరిశీలన చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా చిలుకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుందని, 18 ఏళ్లు నిండిన కోటి మంది మహిళలకు చీరలు అందించనున్నట్లు వెల్లడించారు.గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే పరిమితమైన బీమా సౌకర్యాన్ని రాష్ట్రంలోని అన్ని వృత్తుల వారికి విస్తరించేలా ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని తెలిపారు.ఎల్కతుర్తి మండలంలోని దివ్యాంగులు, వృద్ధులకు కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లు, చేతికర్రలు, ఈవీ వాహనాలు, వినికిడి యంత్రాలు తదితర సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ ప్లేట్లు, పేపర్లలో తినడం ఆరోగ్యానికి హానికరమని, గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలకు మహిళా సంఘాలు అందుబాటులో ఉంచుతున్న స్టీల్ ప్లేట్లను వినియోగించాలని సూచించారు. కేవలం శుభ్రం చేసే ఛార్జీలు చెల్లించి స్టీల్ ప్లేట్లు వినియోగించుకోవచ్చన్నారు.రాబోయే వేసవి, కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే భూగర్భ జలాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, పొలాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని ఒడిసిపట్టాలని పిలుపునిచ్చారు. కాకతీయుల గొలుసుకట్టు చెరువుల స్ఫూర్తితో ప్రతి గ్రామంలో నాలుగైదు ఊటకుంటలు నిర్మించుకోవాలని, సీసీ రోడ్ల పక్కన మ్యాజిక్ పిట్స్ ఏర్పాటు చేయాలని కోరారు.జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు.యువత గంజాయి, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లాలని కోరారు.

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు బహుమతులు

- హిందీ, ఫిజిక్స్‌లో ప్రథమ స్థానం..
- బోటనీలో తృతీయ బహుమతి

హైదరాబాద్, నవంబర్ 16 :

జిజ్ఞాస 2025--26 విద్యార్థుల అధ్యయన ప్రాజెక్టుల పోటీల్లో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పూర్వ రంగారెడ్డి జిల్లా పరిధిలోని 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మధ్య జరిగిన పోటీల్లో అత్యధికంగా మూడు బహుమతులు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. హిందీ, ఫిజిక్స్ విభాగాల్లో ప్రథమ బహుమతులు, బోటనీ విభాగంలో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రూసా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరేట్ సహకారంతో నిర్వహించిన జిజ్ఞాస 2025--26 అధ్యయన ప్రాజెక్టుల బహుమతి ప్రదానోత్సవం నవంబర్ 16న కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయ సీనియర్ ప్రొఫెసర్, సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. కరుణాసాగర్, కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చందన



ఎన్. చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ విభాగంలో డాక్టర్ జి.ఎన్. జగన్, ఫిజిక్స్ విభాగంలో డాక్టర్ కె. హరిత మార్గదర్శకత్వంలో విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించారు. బోటనీ విభాగంలో డాక్టర్ ఆర్. లలిత మార్గదర్శకత్వంలో విద్యార్థులు తృతీయ బహుమతిని పొందారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు విజేత విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకులను ప్రత్యేకంగా



అభినందించారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో జిజ్ఞాస వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అధ్యాపకుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి సమన్వయంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. కళాశాల విద్యార్థులు మూడు బహుమతులు సాధించడంపై అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు.

రామోజీరావు జీవితం, కృషి దేశానికి స్ఫూర్తిదాయకం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్, నవంబర్ 16 : రామోజీరావు 90వ జయం తిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిం చిన తొమ్మిది మందికి ఆయన పేరిట ఏర్పాటు చేసిన రా మోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేయడం అభినం దనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. విజ యవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు.కొందరు వ్యక్తులు తమ కృషితో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదుగుతారని, వారు అం దించిన సేవలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొ న్నారు. అలాంటి మహనీయుల్లో రామోజీరావు ఒకరని కొనియాడారు. కృష్ణా జిల్లాలో సామాన్య రైతు కుటుం బంలో జన్మించిన ఆయన కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయి కి చేరుకున్నారని అన్నారు.రామోజీరావుతో తన పరిచయం అనుకోకుండా జరిగిందని, ఒక సందర్భంలో ఆయన తన కారులో లిఫ్ట్ ఇవ్వడంతో పరిచయం ఏర్పడిందని అమిత్ షా గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత ఆయన్ను కలిసిన ప్రతి సారీ దేశంలోని వివిధ అంశాలు, సమస్యలపై ఆయనకున్న లోతైన అవగాహన, స్పష్టమైన అభిప్రాయాలు తనను ఆశ్చ ర్యపరిచేవని తెలిపారు. గతంలో ఉత్తరప్రదేశ్ ఎన్నికలపై ఆయన చేసిన విశ్లేషణలు ఫలితాల్లో ప్రతిబింబించాయని, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టా ల్సిన అవసరంపై కూడా ఆయనకు స్పష్టమైన అవగాహన ఉండేదని చెప్పారు.తెలుగు పాఠకులకు ప్రతిరోజూ వాస్తవాలను అందించాలనే లక్ష్యం తో ఈనాడు పత్రికను ప్రారంభించారని, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పత్రికను నిలబెట్టారని అమిత్ షా ప్రశంసించారు. రామోజీరావును రామ్‌నాథ్ గోయెంకా వంటి విశిష్ట వ్యక్తులతో మాత్రమే పోల్చగలమని అన్నారు. మారుతున్న కాలానికి, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగు ణంగా రామోజీరావు ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేశారని తెలిపారు. ప్రైవేటు టెలివిజన్ ఛానళ్ల ప్రారంభ దశలోనే 24 గంటల వార్తా ఛానల్‌ను తీసుకురావడం సాహసోపేతమైన నిర్ణయమని, వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ భాషల్లో ఈటీవీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం వినూత్న



ప్రయోగమని పేర్కొన్నారు. చివరిసారిగా కలిసినప్పుడు మొబైల్ ఛానల్ ప్రారంభించే ఆలోచనను రామోజీరావు తనతో పంచుకున్నారని, ఆ ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చిందని అమిత్ షా అన్నారు.వ్యక్తులు తమ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి సంఘర్షిస్తారని, కానీ విలువల కోసం పోరాడేవారే మహనీయులుగా గుర్తింపు పొందుతారని వ్యాఖ్యానించారు. అలాంటి విలువల కోసం నిలబడిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. ఆయనకు పద్మవి భూ షణ్ పురస్కారం లభించినప్పుడు అది తెలుగు గౌరవానికి, పాత్రికేయ రంగానికి దక్కిన గౌరవమని గుజరాత్‌లోని ఓ పత్రిక అభివర్ణించిందని గుర్తుచేశారు.రామోజీరావు కేవలం పత్రికను మాత్రమే స్థాపించలేదని, విలువలతో కూడిన సంస్థను నిర్మించి, అది నిరంతరం కొనసాగేందుకు పునా దులు వేశారని అమిత్ షా అన్నారు. సినిమా రంగంలోనూ ఆయన అందించిన సేవలు విశేషమైనవని, రామోజీ ఫిల్మ్ సిటీలో సినిమా నిర్మాణానికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన తొమ్మిది మందికి రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు అందించడం గౌరవప్రదమైన కార్యక్రమమని, అవార్డులు అందుకున్న వారందరికీ అభినందనలు తెలి పారు. రామోజీరావు పేరు మీద లభించే ఈ పురస్కారాలు అవార్డు గ్రహీతల జీవితాల్లో చిరస్మరణీయమైన గుర్తింపుగా నిలుస్తాయని అమిత్ షా పేర్కొన్నారు.

తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీపీగా డాక్టర్ సౌమ్య మిశ్రా

- చారు సిన్హానుంచి బాధ్యతల స్వీకరణ
- మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబర్ 16 :

హైదరాబాద్, నవంబర్ 16: తెలంగాణ మహిళా భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐపీఎస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని లడ్డీకాపూల్‌లో ఉన్న మహిళా భద్రతా విభాగం కార్యాల యంలో ప్రస్తుత డీజీపీ చారు సిన్హా ఐపీఎస్ నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు.1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన డాక్టర్ సౌమ్య మిశ్రా, ఇకపై రాష్ట్రంలో మహిళల భద్రత, రక్షణ, సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలకు నాయకత్వం వహించను న్నారు.మహిళల భద్రతకు సంబంధించిన సమస్యల పరి ష్కారంలో మహిళా భద్రతా విభాగం కీలక పాత్ర పోషి స్తోంది. ప్రత్యేక కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించడం, సమాజ భాగస్వామ్యం, వివిధ శాఖల సమ న్వయంతో చేపట్టే చర్యల ద్వారా మహిళల భద్రతను బలో పేతం చేసేందుకు కృషి చేస్తోంది.మహిళలు, చిన్నారులకు సురక్షిత మైన, సమ్మిళిత వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ విభాగం పనిచేస్తోంది. నేరాల నివారణ, బాధితులకు రక్షణ, అవగాహన, తక్షణ స్పందన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తోంది. లింగ సమానత్వంపై అవగాహన, సమాజ భాగస్వామ్యం, మహిళల హక్కుల పరిరక్షణలో సమష్టి బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది.డాక్టర్ సౌమ్య మిశ్రా నాయకత్వంలో ఇప్పటికే అమలవుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లోకి అవగాహన కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలంగాణ పోలీస్ విభాగం తెలిపింది. మహిళలు, చిన్నారులు గౌరవం, భద్రత, ఆత్మవి శ్వాసంతో జీవించే సమాజ నిర్మాణానికి మహిళా భద్రతా విభాగం కృషి కొనసాగిస్తుందని పేర్కొంది.డాక్టర్ సౌమ్య మిశ్రాకు తెలంగాణ పోలీస్ స్వాగతం పలుకుతూ, మహిళా భద్రతా విభాగం లక్ష్యాల సాధనలో ఆమె నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

నవంబర్ 20 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు?

- మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

న్యూఢిల్లీ, నవంబర్ 16 : కేంద్ర ప్రభుత్వం నవంబర్ 20 నుంచి 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వ హించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. మరోవైపు, ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం అధికారికంగా ముగిం చలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, డిసెంబర్‌లో జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కూడా వాడీవేడిగా సాగనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావి స్తున్నారు. ఎన్నికల సంఘం పనితీరు, ఎన్నికల ప్రక్రియలో



చేపట్టిన సవరణలు తదితర అంశాలు సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రత్యేక సమావేశాలపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్



- ఘట్‌కేసర్ సర్కిల్‌లో 840 మందికి నూతన చేయూత పెన్షన్లు
- పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

హైదరాబాద్, నవంబర్ 16 :

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నా రు.తెలంగాణ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, కలెక్టర్ మను చౌదరి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితం తువులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో 840 మందికి, మేడ్చల్ నియోజకవర్గం మొత్తం మీద 6,650 మందికి నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభు త్వం సంక్షేమ పాలన అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగులూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరసింహ యాదవ్, డీసీసీ ఉపా ధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మాజీ చైర్మన్ ముల్లి పావని జంగ య్య యాదవ్, డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కర్రె రాజేష్, సామల అమరేందర్, భూమయ్య యాదవ్, ఫ్రూట్ మార్కెట్ డైరెక్టర్ మచందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి ముత్యాలు యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు బొక్కసంజీవరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటిని ప్రజావసరాలకు వినియోగించాలి

- నాగోలు ఎస్టీపీ గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 16 :

శుద్ధి చేసిన మురుగునీటిని వృథా చేయకుండా వివిధ ప్రజావస రాలకు వినియోగించుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. సోమవారం నాగోలులోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)ను ఇతర ఉన్నతాధికారులతో కలిసి సందర్శించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన గ్రీన్ వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్టీపీలో ఏర్పాటు చేసిన ఎయిర్‌టెక్ యంత్రం పనితీరు, నిర్వహణ తీరు, శుద్ధి చేసిన నీటిని వివిధ అవసరాలకు వినియోగిస్తున్న విధానంపై ఆపరేటర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని నిర్మాణ పనులు, మొక్కల పెంపకం, ఇతర అవసరాలకు సమర్థవంతంగా వినియో గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా విధులు నిర్వహించే సిబ్బందికి తాగునీరు, చేతులు కడుక్కో వడం, వ్యక్తిగత పరిశుభ్రత అవసరాల కోసం ప్రత్యేకంగా నీటి క్యా న్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో జలమ

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

నాగార్జున సాగర్‌పై ఏపీ కన్ను!

(మొదటిపేజీ తరువాయి)

సాగునీటి అవసరాలకు కూడా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. తొలి దశలో సుమారు రూ.1,200 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు సమా చారం. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు తాగునీటిని అందించడం దీని ప్రధాన లక్ష్యంగా చెబుతు న్నారు.ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 50 శాతం నిధులను ఏపీ ప్రభుత్వం, మిగిలిన 50 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం భరించనున్నట్లు తెలుస్తోంది.



1,658 కిలోమీటర్ల పైప్‌లైన్..
200 ఓవర్‌హెడ్ ట్యాంకులు

ఈ పథకంలో భాగంగా రోజుకు 160 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణాన్ని ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. ఇన్‌టేక్ వెల్ నుంచి నీటిని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు తరలించనున్నారు. అక్కడి నుంచి ఒక్కొక్కటి 50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు సంపుల్లోకి, అనంతరం 200 ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపిణీ చేయ నున్నారు.ఈ వ్యవస్థలన్నింటినీ అనుసంధానించేందుకు సుమారు 1,658 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మిం చడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో చిన్నచిన్న లిఫ్టులను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొం దించినట్లు తెలుస్తోంది.

ప్రాజెక్టు ప్రాంతంలో భారీ భద్రత.. గోప్యతపై అనుమానాలు

ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అనుమతి లేకుండా ఎవరినీ అటువైపు వెళ్లనివ్వకుండా పోలీసులను మోహరించడంతో పాటు ఇంటెలిజెన్స్ నిఘా కూడా ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా ఏపీ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది?

ఇంత భారీ ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నా తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టు చేపడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ తెలంగాణ బీజేపీ నాయకులు కూడా ఈ అంశంపై గట్టిగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ ప్రాజెక్టుపై తమకు ఎలాంటి సమాచారం లేదని, త్వరలో జరగనున్న కృష్ణా యాజమాన్య బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని నాగార్జున సాగర్ డ్యామ్ ఎస్ఈ మల్లికార్జునరావు వెల్లడించినట్లు సమాచారం. అయితే, ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం సాగర్‌కు సమీపంలోనే ఉన్నప్పటికీ అధికారులకు సమాచారం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ కృష్ణా జలాల వాటాకు ముప్పు?

ఈ ప్రాజెక్టు పూర్తయితే భవిష్యత్తులో తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపులు, వినియోగం విషయంలో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాగర్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని, చట్టబద్ధమైన అనుమతులు, కృష్ణా జలాల కేటాయింపులపై స్పష్టత వచ్చే వరకు నీటి తరలింపు చర్యలను నిలిపివేయాలని సాగర్ ఆయకట్టు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

2014కు ముందు ఇళ్ల పథకంలబ్ధిదారులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం వద్దనే ఉన్న లబ్ధిదారుల ఇండ్ల పట్టాలు/పొజిషన్ సర్టిఫికేట్లను తిరిగి వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా 7 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుం దన్నారు. దాదాపు దశాబ్దానికి పైగా లబ్ధిదారులకు సంబంధించిన వారి ఇంటి పట్టా సర్టిఫికేట్లు తిరిగి రాకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లుగా గౌరవ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారికి , తనకు అనేక విజ్ఞాపనలు వచ్చిన దరిమిలా ఈ అంశంలో ప్రత్యేక దృష్టి సారించామన్నారు.రాష్ట్రంలో 22ఎ మీద సమీక్షలు జరుగుతున్న సమయం లో ఈ పట్టాలు తహసీల్దార్ ఆఫీస్ లలో భారీగా ఉన్నాయని ముఖ్యమంత్రి గారి దృష్టికి రాగా వెంటనే పేదలకు వాటిని వాపస్ చేయాలంటూ ఆదేశించారని దానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లకు ఈ ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.2014 కంటే ముందు అమలు చేసిన పథకంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సబ్సిడీతోపాటు, లబ్ధిదారుల వాటా తోపాటు, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక సహాయం అందించే వారు. ఈ రుణాల కోసం లబ్ధిదారుల ఇండ్లకు చెందిన పట్టాలను షూరిటీగా ఉంచుకునేవారు. రుణ వాయిదాలన్నిటిని సక్రమంగా కట్టి, మొత్తాన్ని తిరిగి చెల్లించిన వారికి పట్టాలను తిరిగి ఇచ్చేవారు. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత , ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని నిలిపివేయడంతో ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందలేదన్నారు.దీంతో తనఖాలో ఉన్న పట్టాలను ఆయా లబ్ధిదారులకు తిరిగి ఇవ్వవలసి ఉందన్నారు. వివిధ కారణాలతో కొంత మంది లబ్ధిదారులకు వారి ఇండ్లకు సంబంధించిన పత్రాలను తిరిగి ఇవ్వలేదని ఈ అంశంలో ప్రత్యేక దృష్టి సారించాలని వాటిని వాపస్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లను ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వాకిటి శ్రీహరి జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్‌తో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో జరిగే ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సుమారు 8,000 మంది క్రీడాకారులు, ప్రతినిధులు పాల్గొననున్నారని సీఎస్ తెలిపారు. ఈ క్రీడా సంబరాలకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రచారం

ఖేలో ఇండియా క్రీడల మస్కట్, లోగోలకు విస్తృత ప్రచారం కల్పించాలని సీఎస్ ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డిం గులు, బెలూన్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. శంషా బాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, కాజీపేట రైల్వే స్టేషన్లతో పాటు నగరంలోని ప్రధాన బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార ఏర్పాట్లు చేయాలని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేలా టార్చ్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

క్రీడాకారులకు మెరుగైన వసతి, రవాణా

క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల రవాణా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, పాఠశాలల నుంచి విద్యార్థులను క్రీడా వేదికలకు తీసుకువచ్చేందుకు తగిన రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.


ప్రముఖ క్రీడాకారులతో యువతకు ప్రేరణ

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించాలని సీఎస్ సూచించారు. ప్రముఖ క్రీడాకారులు, విశిష్ట వ్యక్తులు, ముఖ్యంగా మాజీ క్రికెటర్, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ వంటి క్రీడా ప్రముఖుల ద్వారా విద్యార్థులకు ప్రేరణ కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేలా ఖేలో ఇండియా క్రీడలను ఒక గొప్ప వేదికగా మలచాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర యువజన, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, క్రీడా శాఖ ఎండీ సోనీ బాలాదేవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, డైరెక్టర్ (మీడియా అండ్ కమ్యూనికేషన్స్) శ్రీరామ్ కర్రి, జీహెచ్ఎంసీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, వివిధ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్వాన్ తుపాను తీవ్ర తుపానుగా మారే అవకాశం

- శుక్రవారం నెల్లూరు--తుని మధ్య తీరం దాటే సూచనలు..
- గంటకు 145 కి.మీ వేగంతో గాలులు వీచే ప్రమాదం

అమరావతి, నవంబర్ 16: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా బల పడిందని, దీనికి 'అక్వాన్'గా నామకరణం చేసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ వెల్లడించారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమాచారం ప్రకా రం తుపాను గంటకు 10 కిలో మీటర్ల వేగంతో కదులుతోందని తెలిపారు. మంగళవారం సాయం త్రానికి తీవ్ర తుపానుగా, గురు వారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్నైకి 610 కిలోమీటర్లు, మచి లీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉందన్నారు. పశ్చిమ వాయవ్య దిశగా కదులు తున్నఅక్వాన్ తుపాను శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు--తుని మధ్య తీరం దాటే అవకాశం ఉం దని ప్రఖర్‌జైన్ తెలిపారు.తీరందాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన..తుపాను ప్రభావంతో ఎల్లుండి నుంచి కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గురు, శుక్రవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు, రైతులు తుపాను ప్రభా వాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుపానుకు సంబం ధించిన సమస్యలు, సహాయం కోసం 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009కు సమా చారం అందించాలని కోరారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని ప్రఖర్ జైన్ సూచించారు.



చేయూత పింఛన్లు అందించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



వితంతువులు, దివ్యాంగులు, వృద్ధుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చారు.అక్కన్నపేట మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తామని, ఇందుకోసం MRO, MPDO కార్యాలయాలు లేదా పోలీస్ స్టేషన్ సమీపంలో అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు.తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.79 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ప్రతి పేద కుటుంబానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్లు లేని పేదలు, తక్కువ భూమి ఉన్నవారు, ఆడపిల్లల తల్లులకు ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు.గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు చిన్న గ్రామాలకు రూ.లక్ష, పెద్ద గ్రామాలకు రూ.2 లక్షల చొప్పున క్రీడా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్‌లో ఇప్పటికే కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. తల్లిదండ్రులు ఎన్ని కష్టాలైనా భరించి తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని కోరారు.నీటి ఎద్దడి రాకుండా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి గ్రామంలో సర్పంచులు చొరవ తీసుకొని గుట్టల పక్కన 5 నుంచి 6 ఊటకుంటలు నిర్మించాలని సూచించారు. అక్కన్నపేట మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని లూటీ చేయ్..కార్పొరేట్లకు దోచిపెట్టు

- మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానమిదే
- దేశంలో భూసంస్కరణలు అమలు చేసింది కమ్యూనిస్టు ప్రభుత్వాలే
- అమెరికా సామ్రాజ్యవాదాన్ని అమలు చేస్తున్న మోడీ
- ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీల విస్మరణ
- దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలను బలోపేతమవ్వాలి
- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్



హైదరాబాద్, నవంబర్ 16 : దేశాన్ని లూటీచేయ్.. కార్పొరేట్లకు దోచిపెట్టు అన్నట్టుగా కేంద్రంలోని బీజేపీ పాలనా విధానం ఉందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా ఆ దేశాధ్యక్షులు ట్రంప్ చెబుతున్న విధానా లన్నింటినీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును వివరించారు. నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్ (జీఎమ్ గౌడ్ కన్వెన్షన్‌హాల్)లోని అచ్యుతానందన్ హాల్‌లోని శంకరయ్య వేదికగా జరుగుతున్న ఏఐకేఎస్ జాతీయ 36వ మహాసభలో విజూ కృష్ణన్ మాట్లాడారు. అమెరికా, న్యూజి లాండ్, యూరోపియన్ యూనియన్, తదితర దేశాలతో మన దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా మోడీ సర్కారు చేసుకుం టున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు దేశ ఆర్థిక సమగ్రతకే ప్రమాదకరమని హెచ్చరించారు. అమెరికాలో ఒక రైతు సగటు భూమి 400 ఎకరాలనీ, ఆ రైతు పంటలు పండించేందుకు అక్కడ పెద్ద ఎత్తున సబ్సిడీలు అందుతాయని తెలిపారు. కానీ, మన దేశంలో ఒక రైతు సగటు వ్యవసాయ కమతం ఐదెకరాల లోపేననీ, మన దగ్గర ఇచ్చే సబ్సిడీ అంతంతేననీ, అలాంట ప్పుడు మన రైతు విదేశీ రైతులతో ఎలా పోటీగలడని ప్రశ్నిం చారు. ఆ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అ యితే మన రైతులు రోడ్డున పడే ప్రమాదముందని హెచ్చరిం చారు. దేశంలో మోడీ, అంబానీ, అదానీ లూటీ పాలన సాగు తున్నదని విమర్శించారు. ఖనిజవనరులను, భూములను మోడీ సర్కారు కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగ ట్టారు. ఓవైపు అడవుల సరంక్షణ పేరుతో ఆదివాసీలను మోడీ సర్కారు బలవంతంగా అడవుల నుంచి గెంటివేస్తూ మరోపక్క అదే అడవుల్లో ఖనిజవనరులను అంబానీ, అదానీ, జిందాల్, బిర్లా లాంటి కార్పొరేట్లు దోచుకునేందుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నదనీ, పర్యావరణ విధ్వంసానికి కారకులు కార్పొరేట్లే అని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టు పోరాటాలు చేసిన, కమ్యూనిస్టు ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లోనే భూసంస్కరణలు అమలై పేదలకు భూములు పంచబడ్డాయని గర్వంగా చెప్పారు. హిందూత్వ అజెండా ముసుగులో ముస్లింలు, క్రిస్టియన్లు, ఆది వాసీలు, గిరిజనులు, మహిళలపై దాడులు పెరిగిపోతుం డటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను కట్టుబానిస లుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ సర్కారు తీసుకొ చ్చిందని విమర్శించారు. సర్ పేరుతో 14 కోట్ల ప్రజలను ఈసీ తొలగించిన తీరును వివరించారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతి రేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందనీ, జాతీయ మీడియా దీన్ని కప్పిబె డుతూ బడ్జెట్‌ను పొగుడుతూ కథనాలు రాసిన తీరును ఎండగ ట్టారు. దేశంలో సబ్సిడీలు, రుణాలు, పంట నష్టపరిహా రాలు అందక కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపా రు. తెలంగాణలో 20 లక్షల మందికిపైగా, ఏపీలో 30 లక్షల మందికిపైగా కౌలు రైతులున్నారనీ, వారిని ఆదుకోవ డంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శిం చారు. దేశంలో 342కిపైగా జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొంటే కేంద్ర ప్రభుత్వంగానీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలుగానీ రైతులు పైసా సహాయం అందించలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమా ండ్ చేశారు. గ్రామీణ పేదలను రోడ్డున పడేసేలా వీబీజీరామ్‌జీ పథకం ఉందని విమర్శించారు. ఎకోటూరిజం, తదితర అభివృద్ధి పనుల పేరిట రైతుల నుంచి భూములను లాక్కోవడాన్ని తప్పుబట్టారు.భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఢిల్లీ రైతాంగ పోరాట విరమణ సందర్భంగా మోడీ సర్కారు ఇచ్చిన లిఖిత పూర హామీలను వెంటనే నెరవే ర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్ఎస్ స్వామినాథన్ సిఫారసుల ను అమలు చేయాలని విన్నవించారు. మోడీ సర్కారు అనుసరి స్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలను ఉధృతం చేయాలనీ, రైతాంగ, కార్మిక ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు ఆత్మహత్యలతో కుటుంబాలు ఆగం

ఆ కుటుంబ మహిళలపై తీవ్ర భారం : ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి టీచర్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కర్షక వ్యతిరేక విధానాల ఫలితంగా వ్యవసాయం చేసే రైతులు సంక్షోభంలోకి కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, ఆ తర్వాత కుటుంబ మహిళలపై తీవ్ర భారం పడుతున్నదని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి టీచర్ చెప్పారు. నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డినగర్‌లోని వీఎస్. అచ్యుతానందన్ ప్రాంగణంలోని శంకరయ్య వేదికగా జరుగుతున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలో ఆమె సౌహార్ద సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమైనదని చెప్పారు. ఆ పోరాటంలో మహిళల పాత్రను గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితో మహిళలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లోకి పెట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే వ్యవసాయ అనుబంధ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నదని తెలిపారు. వ్యవసాయం మహిళల పాత్ర కీలకమనీ, ఇటు ఇంటి పనినీ, అటు వ్యవసాయ పనులను చేస్తున్నా వారి శ్రమకు గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన రైతాంగ పోరాటం ఐక్యపోరాటానికి చిహ్నంగా నిలిచిందని తెలిపారు.

మోడీ పాలనలో పెరుగుతున్న నియంతృత్వం : ఏఐకేకేఎమ్ఎస్ సీనియర్ నేత శంకర్ ఘోష్

మోడీ పాలనలో దేశంలో నియంతృత్వం పెరిగిపోయిందనీ, పరి పాలనా వ్యవస్థ గాడితప్పిందని ఏఐకేకేఎమ్ఎస్ సీనియర్ నేత శంకర్ ఘోష్ విమర్శించారు. ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలో ఆయన సౌహార్ద సందేశాన్నిచ్చారు. పెట్రోల్, డీజిల్, సీడ్స్, విత్తనాలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయనీ, దానిపై సాగుపైనా, రైతు ఆర్థికస్థితిపైనా తీవ్ర ప్రభావం పడుతున్నదని చెప్పారు. దీనివల్ల చాలా మంది రైతులు తమ భూములను కోల్పోయి రోడ్డున పడుతున్నారని తెలిపారు. ప్రజల ఓట్లను ఎత్తివేసేందుకు సర్ పేరుతో పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడాన్ని తప్పుబట్టారు. మోడీ ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే వారిపై నేరుగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందుల గురించి ఆలోచించకుండా బీజేపీ మతం పేరిట ప్రజల్ని చీల్చిందని విమర్శించారు.

నైజాంను తరిమినట్టే మోడీని తరిమేయాలి : ఏఐకేఎస్‌కే ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శర్మ

తెలంగాణలో రైతాంగ పోరాటం ద్వారా నైజామోడీని తరిమినట్టే ఐక్య పోరాటాల ద్వారా కేంద్రంలోని మోడీ సర్కా రును తరిమికొట్టాలని ఏఐకేఎస్‌కే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురు షోత్తం శర్మ పిలుపునిచ్చారు. అధికారం కోసం బీజేపీ ఓట్ల చోరీ కి పాల్పడుతున్నదని విమర్శించారు. మోడీ సర్కారు కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని కట్టబెడుతున్నదనీ, దేశం లోని సహజ వనరులు దోచుకునేందుకు అనుకూల చట్టాలు చేస్తున్నదని తెలి పారు.రైతన్నలను సాగు నుంచి పక్కకుపోయేలా చేస్తున్న తీరును ఎండగట్టారు. మరోవైపు కూలీలకు, పేదలకు కొంతమేరకు ఉప యోగపడుతున్న నరేగా చట్టాన్ని రద్దు చేసి వీబీగ్రామ్‌జీని తీసుకొ చ్చిందనీ, దీనివల్ల ఉపాధి అవకాశాలు తగ్గే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా, రైతాంగ వ్య తిరేక విధానాలపై సంయుక్త పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అట్టహాసంగా ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు ప్రారంభం
సంఘం జెండాను ఎగురవేసిన అధ్యక్షులు అశోక్ దావలే
అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన జాతీయ నాయకత్వం, ప్రతినిధులు

నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో(జీఎమ్ గౌడ్ కన్వెన్షన్ హాల్)లో అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలో ప్రతినిధుల సభ అట్టహాసంగా మొదలైంది. 36వ మహాసభను పురస్కరించుకుని 36 ఏఐకేఎస్ జెండాలను ఏర్పాటు చేశారు. ప్రారంభసూచికగా ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే ఆ సంఘం జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఇంక్విలాబ్ జిందాబాద్...ఇంక్విలాబ్ జిందాబాద్...ఏఐకేఎస్ జిందాబాద్...ఏఐకేఎస్ జిందాబాద్ జిందాబాద్...అంటూ ప్రతినిధులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, కోశాధికారి పి.కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు హన్నన్‌మొల్లా, అమ్రారామ్, ఈపీ.జయరంజన్, ఎస్‌కే.ప్రీజ, హమాల్ అల్దార్, పి.షణ్ముగం, బిప్లవ్ మజుందార్, ఎం.విజయ్‌కుమార్, ఇంద్రజిత్‌సింగ్, సంయుక్త కార్యదర్శులు బాదల్ సరోజ్, వల్సన్ పనోలి, పవిత్రకార్, ముకుత్‌సింగ్, తీగల సాగర్, డి.రవీంద్రన్, అజిత్ నావలే, అపదేశ్‌కుమార్, వినోద్ కుమార్, రఘువీర్ గుడిగాయ్, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎలమారం కరీం, జాతీయ నాయకులు సింధు, ఎం.సాయిబాబు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా జాతీయ అధ్యక్షులు శ్రీమతి టీచర్, ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు సుభాష్ జెక్కర్, తెలం గాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్, కోశాధికారి ఎం.శోభన్, మహాసభ ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీఎన్ఎమ్ కళాకారులు పాటలు ఆలపించారు. గంగిరెద్దుల కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా మహిళలు బతుకమ్మలను ఎత్తుకొచ్చారు. రైతు మహాసభల ప్రాంగణంలో ఎద్దులబండిని ఏర్పాటు చేశారు. చాలా మంది ప్రతినిధులు అక్కడ ఫొటోలు దిగార

అయ్యప్ప భక్తులకు అన్నదాన సేవలు అభినందనీయం



- భక్తుల సేవకు ప్రభుత్వం అండగా ఉంటుంది..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, వేములవాడ:

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చే అయ్యప్ప మాలాధారణ భక్తులకు అన్నదానం, అల్పాహార సేవలు అందిస్తున్న అయ్యప్ప అన్నదాన సేవా సమితి కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో అయ్యప్ప అన్నదాన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడకు తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు తరలివస్తుంటారని తెలిపారు. దీక్షలో ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచితంగా భోజనం, అల్పాహారం అందించాలనే సంకల్పంతో సుమారు 60 మంది అయ్యప్ప భక్తులు సమితిగా ఏర్పడి కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు . గతంలో అద్దె భవనంలో సేవలు అందించిన సమితికి సొంత భవన నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా స్థలం కేటాయించామని, దాతల సకారంతో నేడు సొంత భవనాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని, ముఖ్యంగా దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు ఆహారం అందించడం పుణ్యప్రదమైన సేవ అని పేర్కొన్నారు. అన్నదానంలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దాతలు మరింతగా ముందుకొచ్చి సమితికి సహకరించాలని కోరారు. సుమారు 20 ఏళ్ల క్రితం తాను దేవస్థానం చైర్మన్‌గా ఉన్న సమయంలో శివమాల భక్తులకు అన్నదానం, అల్పాహారం అందించేందుకు శివ సేవా సమితికి కూడా ప్రభుత్వ స్థలం కేటాయించిన అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రాచీన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తోందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సుమారు రూ.250 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, రాబోయే గోదావరి పుష్కరాల కంటే ముందే పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని అన్నారు .

శివరాత్రి సహా వివిధ పర్వదినాల్లో వేములవాడకు వచ్చే వేలాది మంది భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, సేవా సమితులు, దాతలు అన్నదానం, అల్పాహారం అందించడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, అయ్యప్ప అన్నదాన సేవా సమితికి అన్ని విధాలా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.



ఆధ్యాత్మికం.. అభివృద్ధి.. ఆత్మీయత..

- సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన కేటీఆర్..
- క్రీడాకారులకు అభినందనలు..
- బాధిత కుటుంబానికి పరామర్శ
- ప్రారంభోత్సవాలు, పరామర్శల్లో పాల్గొన్న వర్కింగ్ ప్రెసిడెంట్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పలు శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు నూతనంగా నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానికుల నుంచి సమస్యలు, వినతులు స్వీకరించి, క్రీడాకారులను అభినందించారు.

గంభీరావుపేట మండలం జగదంబ తండాలో ఎన్నారై భూక్యా ప్రశాంత్ వివాహ రిసెప్షన్‌కు హాజరైన కేటీఆర్ నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలు, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని హోమం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వీర్నపల్లి మండలం అడవిపదలో మాజీ సర్పంచ్ భాస్కర్ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.సిరిసిల్ల పట్టణంలోని 9వ వార్డు జగ్గారావుపల్లెలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, బాబాజీనగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, స్థానిక కౌన్సిలర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బోనాలలో శ్రీ రుక్మిణి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సీనియర్ పాత్రికేయుడు ప్రసాద్ రెడ్డి నూతన గృహప్రవేశం సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్వీ నాయకుడు కత్తెర వరుణ్ సోదరుడి వివాహం సందర్భంగా వారి ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఆయనను కలవగా, వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.చివరగా సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్లూరు రాజు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇటీవల రాజు తల్లి మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

-60 మందికి రూ.17.40 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, వేములవాడ:

ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని 60 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.17 లక్షల 40 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తూ వారి కష్టాల్లో భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

హామీలు అమలు చేయకుంటే సమ్మే తప్పదు..



- ఎన్నికల హామీలు అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట ఆశాల ఆందోళన..
- కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ప్రజారోగ్య పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలినాళ్లలో రూ.150 పారితోషికంతో ప్రారంభమైన తమ సేవలకు ప్రస్తుతం గరిష్ఠంగా రూ.9,900 వరకు చెల్లిస్తున్నప్పటికీ, అది కూడా చేసిన పనులు, కేసుల ఆధారంగానే ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ నెలవారీ స్థిర వేతనం లేదని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి నెలకు రూ.18 వేల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు విపరీతమైన లక్ష్యాలు విధిస్తూ పనిభారాన్ని పెంచుతున్నారని ఆరోపించారు.గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు తీసుకురావాలని అధికారులు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారని, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించే గర్భిణుల విషయంలో తమను బాధ్యులుగా చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న తరుణంలో రావాల్సిన వేతనాలను జమ చేయకుండా ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని మండిపడ్డారు.తమకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని అన్నారు .



క్యాన్సర్ బాధితుడి కుటుంబానికి అండగా ఉంటా

- బండ పెంటయ్య కుటుంబానికి కేటీఆర్ భరోసా

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం ఆల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు బండ పెంటయ్య కుటుంబానికి అండగా ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చిన కేటీఆర్‌ను ఆల్మాస్‌పూర్ గ్రామ సర్పంచ్ కొర్రి అనిల్, బడే రమేష్, ములిగే ప్రమోద్‌తో కలిసి పెంటయ్య కుటుంబ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా పెంటయ్య అనారోగ్య పరిస్థితిని, వైద్య ఖర్చుల కోసం కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేటీఆర్‌కు వివరించారు.

కుటుంబ సభ్యుల ఆవేదనను ఆలకించిన కేటీఆర్ స్పందిస్తూ, కష్టకాలంలో బండ పెంటయ్య కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తమ కుటుంబానికి భరోసా కల్పించిన కేటీఆర్‌కు పెంటయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తుల సౌకర్యార్థం స్నానాల గదుల్లో గీజర్లు ఏర్పాటు చేయాలని వినతి..

- మ్యాకల పర్శరాములు వినతిపై సానుకూలంగా స్పందించిన వేములవాడ దేవస్థానం ఈఓ.

బలగం టీవీ, వేములవాడ:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి కార్తీకమాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం కల్యాణ కట్ట ప్రక్కన ఉన్న స్నానాల గదుల్లో గీజర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాకల పర్శరాములు వేములవాడ దేవస్థానం ఈఓ కి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ.. కార్తీకమాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తున్నారని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు చలికాలంలో చల్లని నీటితో స్నానం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భక్తుల ఆరోగ్యం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కల్యాణ కట్ట సమీపంలోని స్నానాల గదుల్లో గీజర్లు ఏర్పాటు చేసి వేడి నీటి సదుపాయం కల్పించాలని కోరారు.మ్యాకల పర్శరాములు అందించిన వినతిపత్రంపై దేవస్థానం ఈఓ సానుకూలంగా స్పందిస్తూ, భక్తుల సౌకర్యార్థం స్నానాల గదుల్లో గీజర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

భక్తుల సమస్యను సానుకూలంగా పరిశీలించి గీజర్ల ఏర్పాటుకు హామీ ఇచ్చిన దేవస్థానం ఈఓ కి మ్యాకల పర్శరాములు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ గడ్డం నరేష్, వేములవాడ టౌన్

జానపద కళాకారులకు టీటీడీ గుర్తింపు కార్డులు

- అనంతారం రాధాకృష్ణ భక్త కళాబృందానికి గుర్తింపు

బలగం టీవీ, ఇల్లంతకుంట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన రాధాకృష్ణ భక్త కళాబృందానికి జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో టీటీడీ తరపున గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారుల ప్రతిభను గుర్తిస్తూ గుర్తింపు కార్డులను అందజేసి అభినందించారు. ఈ గుర్తింపు తమ కళాబృందానికి ప్రోత్సాహాన్నిస్తుందని కళాకారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు వికృతి రవీందర్, గరిగే లక్ష్మణ్, సత్యనారాయణ, చంద్రమౌళి, దారవేణి మల్లేశం, బాధ బాలయ్య, దారవేణి దేవయ్యతో పాటు మహిళా కళాకారులు పాల్గొన్నారు.



బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి..



- అర్జీలను వెంటనే పరిష్కరించాలి..
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రత్యేక బాలల ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్, కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన బాలల నుంచి అర్జీలు స్వీకరించారు. దివ్యాంగుల పింఛన్లు, అదనపు తరగతి గదులు, పాఠశాలల్లో మౌలిక వసతులు, ఇందిరమ్మ ఇళ్లు, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలని పలువురు బాలలు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

బాలల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే ప్రత్యేక ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడుతూ వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బోర్డుపై 'పిల్లలూ.. మీరే భవిష్యత్తు.. ఉన్నతంగా ఎదగండి.. మేము మీకు తోడుగా ఉంటాం' అనే సందేశాన్ని రాసి కలెక్టర్ సంతకం చేశారు.

ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఏంజెలా ఆల్ఫోడ్, విద్యాశాఖ అధికారి విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

- ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై ఆర్డీవోలు, డీఆర్డీఓ, సీపీఓ, డీపీఓ, డీసీఎస్ఓ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 1,92,000 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాలని సూచించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో అధికారులు ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రేషన్ కార్డులు ఉన్నవారితో పాటు లేనివారు కూడా ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు బీమా పొందేందుకు అర్హులని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. బీమా పొందే వ్యక్తులు తమకు నచ్చిన విధంగా నామినీలను ఎంపిక చేసుకోవచ్చని, దరఖాస్తులో బీమా పరిహారానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేసి సంతకం చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిబిరాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు, టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయాలతో పాటు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఖాతాల్లోకి చేయూత పింఛన్లు..



- జిల్లాలో 8,209 మందికి కొత్తగా మంజూరు పత్రాలు
- తంగళ్లపల్లిలో 802 మందికి పంపిణీ

బలగం టీవీ, తంగళ్లపల్లి:

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సోమవారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులపై అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించి అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు . ఈ నెల 18వ తేదీ వరకు మంజూరు పత్రాల పంపిణీ పూర్తిచేస్తామని, 19వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.

జిల్లావ్యాప్తంగా 8,209 మందికి నూతన పింఛన్లు మంజూరు కాగా, తంగళ్లపల్లి మండలంలో 802 మందికి మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు . పింఛన్లు పొందుతున్న వారిలో పనిచేసే ఆరోగ్యం, సామర్థ్యం ఉన్నవారు ఆదాయం సమకూర్చుకునే పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను త్వరలో మంజూరు చేస్తామని, అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల విలువైన బీమా కల్పించనున్నట్లు తెలిపారు . ఇందుకోసం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు సమర్పించాలని సూచించారు. నెల రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులతో మెరుగైన అవకాశాలు

- విద్యార్థినుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,తంగళ్లపల్లి:



ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులు, వివిధ వృత్తివిద్యా కోర్సుల ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు భవిష్యత్ లో పొందవచ్చని, విద్యార్థినీల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలను కలెక్టర్ సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టాఫ్ రూమ్, తరగతి గదులు, కిచెన్,ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను వివిధ మౌలిక సదుపాయాలను, వసతులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీ తీరును పరిశీలించి, నిర్దేశిత మెనూ పాటిస్తూ భోజనం అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థినులు నేర్చుకుంటున్న అంశాలు, కోర్సు ద్వారా భవిష్యత్తులో అందుబాటులో ఉండే అవకాశాల గురించి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... విద్యార్థినులు తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా రోజూ తరగతులకు హాజరవుతూ, క్రమశిక్షణతో విద్యలో రాణించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.కళాశాలలో ఇంటీరియర్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ & డిజిటల్ ఇమేజింగ్ కోర్సులు ఉన్నాయని అధ్యాపకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు..ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులు తమ లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

పింఛన్ల పెంపు హామీ ఏమైంది?..



- కొత్త పింఛన్ల పేరుతో కాంగ్రెస్ సర్కార్ నాటకాలు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్!
- అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, మూడేళ్లయినా అమలు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు
- ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు కొత్త పింఛన్ల మంజూరు పేరుతో ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపిందని ఎద్దేవా

బలగం టీవీ, ధర్మారం

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల సొమ్మును పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మూడేళ్ల పాలన పూర్తవుతున్నా ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి ఉండకుండా, ఇప్పుడు కొత్త పింఛన్ల మంజూరు పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల హామీని తుంగలో తొక్కారు:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల పేదలకు తీరని అన్యాయం జరుగుతోందని కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు.

"అధికారంలోకి వస్తే వృద్ధాప్య, ఇతర పింఛన్లను రూ.2,000 నుంచి రూ.4,000లకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,000 నుంచి రూ.6,000లకు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రణాళికలో స్పష్టంగా హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు పెంచలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని ఆయన నిలదీశారు.

పేదల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, మూడేళ్లలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు.

కేసీఆర్ హయాంలోనే పేదలకు భరోసా:

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సంక్షేమం కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత, నేత కార్మికులు సహా తొమ్మిది రకాల వర్గాలకు చెందిన 43 లక్షల మందికి పింఛన్లు అందించి ఆదుకున్నారని ఈశ్వర్ గుర్తు చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పింఛన్ పొందుతున్న వృద్ధులు మరణిస్తే, వెంటనే వారి స్థానంలో కుటుంబంలోని అర్హులైన వారికి పింఛన్ బదిలీ చేసే విధానం ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎంతోమంది వృద్ధులు చనిపోయినా వారి కుటుంబ సభ్యులకు పింఛన్లు ఇవ్వకుండా నిలిపివేసిందని ఆరోపించారు.

ప్రస్తుతం కొత్త పింఛన్ల పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వం, అర్హులైన వృద్ధాప్య బీడీ కార్మికుల నుంచి దరఖాస్తులు ఎందుకు స్వీకరించడం లేదని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వానికి నిజంగా పేదలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని, పెంచిన మొత్తాన్ని కొత్త లబ్ధిదారులకు కూడా వర్తింపజేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు భారత స్వామి, నారా ప్రేమ్ సాగర్, తుమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన వేములవాడ..

- కార్తీక సోమవారం వేళ రాజన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు
- పవిత్ర కార్తీక సోమవారం కావడంతో దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- రాజన్న, భీమేశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన భక్తులు

బలగం టీవీ, వేములవాడ:



పవిత్ర కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. రాజన్నతో పాటు భీమేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

నీటి తొట్టిలో పడి ఆరేళ్ల బాలుడు మృతి..!

- జగిత్యాల జిల్లాలో విషాదం:
- మల్లాపూర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో పశువుల నీటి తొట్టిలో పడి చిన్నారి సూర బన్నీ దుర్మరణం
- కూలీ పనులకు వెళ్లి సాయంత్రానికి తల్లి ఇంటికి వచ్చేసరికి కనిపించని బాలుడు; పరిసరాల్లో వెతకగా విగతజీవిగా లభ్యం
- కళ్ల ముందల తిరిగిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు; కాలనీలో అలుముకున్న విషాదఛాయలు

బలగం టీవీ, జగిత్యాల:



జగిత్యాల జిల్లాలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో పశువులకు నీళ్లు తాగించేందుకు ఏర్పాటు చేసిన తొట్టిలో ప్రమాదవశాత్తు పడి ఆరేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. అప్పటివరకు కళ్ల ముందల అల్లరి చేస్తూ తిరిగిన చిన్నారి విగతజీవిగా మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

అసలేం జరిగిందంటే..?


వడ్డెర కాలనీకి చెందిన సూర లావణ్య, అంజయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తల్లి లావణ్య రోజువారీ కూలీ పనుల నిమిత్తం ఉదయం వాల్గొండ గ్రామానికి వెళ్ళింది. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఇద్దరు పిల్లలు మాత్రమే కనిపించారు.

ఆరేళ్ల చిన్నారి సూర బన్నీ కనిపించకపోవడంతో అందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు.

ఆ వెతుకులాటలో ఇంటి సమీపంలో పశువులకు నీళ్లు తాగించేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో చిన్నారి పడిపోయి ఉన్నట్లు గుర్తించారు.

వెంటనే బాలుడిని బయటకు తీసినప్పటికీ, అప్పటికే బాలుడు మృతి చెందాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ అకస్మిక విషాదంతో వడ్డెర కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.



డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో మిరా ఆండ్రీవా చారిత్రాత్మక విజయం!

- సీజన్ ముగింపు టోర్నీ ఫైనల్లో ఉక్రెయిన్ ప్లేయర్ ఎలీనా స్విటోలినాను 7-5, 6-3 తేడాతో చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకున్న 19 ఏళ్ల ఆండ్రీవా
- టోర్నమెంట్ ఆద్యంతం ఒక్క సెట్ కూడా ఓడిపోకుండా అజేయంగా ట్రోఫీ గెలిచి.. మార్టినా నవ్రతిలోవా, సెరెనా విలియమ్స్ వంటి దిగ్గజాల సరసన చోటు
- డబుల్స్ విభాగంలో ఇటలీ ద్వయాన్ని ఓడించి ఛాంపియన్‌గా నిలిచిన క్యాథరీనా సినికోవా - టేలర్ టౌన్‌సెండ్ జోడీ

బలగం టీవీ, కాలిఫోర్నియా:

విమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ (WTA) సీజన్ ముగింపు టోర్నీ 'డబ్ల్యూటీఏ ఫైనల్స్'లో రష్యా యువ టెన్నిస్ సంచలనం మిరా ఆండ్రీవా (Mirra Andreeva) అద్భుత విజయాన్ని అందుకుంది. కాలిఫోర్నియాలోని ఇండియన్ వెల్స్ వేదికగా జరిగిన తుదిపోరులో ఆండ్రీవా 7-5, 6-3 వరుస సెట్లలో ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్విటోలినాను చిత్తు చేసి ఛాంపియన్‌గా అవతరించింది. 19 ఏళ్ల ఆండ్రీవాకు తన కెరీర్‌లో ఇదే తొలి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్ కావడం విశేషం. ఈ విజయంతో ఆమె డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ప్రపంచ 2వ ర్యాంక్‌కు చేరుకుంది.

దిగ్గజాల సరసన 19 ఏళ్ల ఆండ్రీవా:

ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఆద్యంతం ఆండ్రీవా తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది.

టోర్నీలో ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా (Unbeaten) టైటిల్‌ను కైవసం చేసుకుంది.

డబ్ల్యూటీఏ ఫైనల్స్ చరిత్రలో ఒక్క సెట్ కూడా ఓడిపోకుండా ట్రోఫీ నెగ్గిన క్రీడాకారిణుల జాబితాలో మార్టినా నవ్రతిలోవా, సెరెనా విలియమ్స్ వంటి దిగ్గజాల సరసన ఆండ్రీవా 11వ ప్లేయర్‌గా నిలిచి అరుదైన ఘనత సాధించింది.

'నో షేక్‌హ్యాండ్' విధానం – డబుల్స్‌లో సినికోవా జోడీ హవా:

రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు స్విటోలినా, ఆండ్రీవా సంప్రదాయ 'నో షేక్‌హ్యాండ్' విధానాన్ని పాటించడంతో పాటు కలిసి ఫొటోలకు కూడా ఫోజులివ్వలేదు.

మరోవైపు, మహిళల డబుల్స్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ - అమెరికా జోడీ క్యాథరీనా సినికోవా - టేలర్ టౌన్‌సెండ్ అద్భుత ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకుంది. తుదిపోరులో ఇటలీ ద్వయం సారా ఎరానీ - జాస్మిన్ పౌలినిని ఓడించి ఈ సీజన్‌లో తమ ఆరో టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది.



49 ఏళ్ల నాటి తొలి బ్యాట్‌తో సచిన్ టెండూల్కర్ మధుర జ్ఞాపకం

- పాత ఫొటోను రీక్రియేట్ చేసిన మాస్టర్ బ్లాస్టర్!

బలగం టీవీ, ముంబై:

భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందుల్కర్ తన చిన్ననాటి మధుర స్మృతులను అభిమానులతో పంచుకున్నారు. క్రికెట్ ప్రపంచానికి ఎంతో సుపరిచితమైన తన చిన్ననాటి ఐకానిక్ ఫొటోను సచిన్ తాజాగా రీక్రియేట్ చేశారు. చిన్నప్పుడు తన మొదటి బ్యాట్ పట్టుకుని దిగిన ఫొటో తరహాలోనే, సరిగ్గా 49 ఏళ్ల తర్వాత అదే బ్యాట్‌తో సేమ్ పోజులో దిగిన కొత్త ఫొటోను సోమవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు.

49 ఏళ్లుగా పదిలంగా తొలి బ్యాట్:

చిన్ననాటి ఫొటోతో పాటు తాజా ఫొటోను జతచేసి పోస్ట్ చేసిన సచిన్.. "పెహ్లీ బ్యాట్ కీ బాత్ హై, 49 సాల్ బాద్ భీ మేరా సాథ్ హై" (మొదటి బ్యాట్ ప్రత్యేకతే వేరు.. 49 ఏళ్ల తర్వాత కూడా నాతోనే ఉంది) అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌ను జతచేశారు. ప్రపంచ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు తిరగరాసినప్పటికీ, తన ప్రయాణానికి నాంది పలికిన మొదటి బ్యాట్‌ను దాదాపు ఐదు దశాబ్దాలుగా అత్యంత పదిలంగా దాచుకోవడం సచిన్‌కు ఆటపై ఉన్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అభిమానుల భావోద్వేగ స్పందన:


సచిన్ షేర్ చేసిన ఈ రెండు ఫొటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

మాస్టర్ బ్లాస్టర్ తన మూలాలను, చిన్ననాటి జ్ఞాపకాలను ఇప్పటికీ మర్చిపోలేదని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

"మాస్టర్‌తో పాటు నమ్మకమైన ఆయన నేస్తం" అని ఒక అభిమాని కామెంట్ చేయగా, "గాడ్ ఆఫ్ క్రికెట్" అంటూ మరికొందరు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

అద్భుత విజయంతో మొదలుపెట్టిన కార్లోస్ అల్కరాజ్!

- టురిన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్సెస్ టియాఫోను 6-2, 6-2 సెట్లతో చిత్తు చేసిన ప్రపంచ 3వ ర్యాంకర్ కార్లోస్ అల్కరాజ్
- అల్కరాజ్ అద్భుతమైన ఆటతీరును చూసి అతనొక 'సూపర్‌మెన్' అంటూ ప్రశంసించిన అమెరికన్ ప్లేయర్ టియాఫో
- ఈ విజయంతో తన విన్నింగ్ స్ట్రీక్‌ను 10 మ్యాచ్‌లకు పొడిగించుకున్న 23 ఏళ్ల స్పానిష్ స్టార్



బలగం టీవీ, టురిన్ (ఇటలీ):

ఏటీపీ ఫైనల్స్ (ATP Finals) టోర్నమెంట్‌లో స్పానిష్ టెన్నిస్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ అదుగుపెట్టిన తీరు అద్భుతంగా ఉంది. ఇటలీలోని టురిన్ వేదికగా సోమవారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-2, 6-2 తేడాత అమెరికాకు చెందిన టాప్-10 ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోపై ఏకపక్ష విజయం సాధించాడు. వియన్నా, పారిస్ టోర్నీల్లో ట్రోఫీలు గెలుచుకున్న అల్కరాజ్, ఇక్కడ కూడా అదే జోరును కొనసాగిస్తూ తన విజయాల పరంపరను 10 మ్యాచ్‌లక పెంచుకున్నాడు.

మ్యాచ్ ఆద్యంతం అల్కరాజ్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. కేవలం 2 నిమిషాల్లోనే తొలి సెట్‌ను కైవసం చేసుకున్న అతడు, మ్యాచ్‌లో మొత్తం 21 విన్నర్లు కొట్టడమే కాకుండా, టియాఫో రెండో సర్వ్‌లపై వచ్చిన అన్ని పాయింట్లనూ (12/12) గెలుచుకోవడం విశేషం.

కోర్టులో అల్కరాజ్ కదలికలు, అద్భుతమైన షాట్లు చూసి విస్తుపోయిన ప్రత్యర్థి టియాఫో మ్యాచ్ తర్వాత మాట్లాడుతూ.. "కొన్నిసార్లు అతను అసలు మనిషిలా కాకుండా 'సూపర్‌మెన్' లా అద్భుతంగా ఆడతాడు. ఆ స్థాయి ఆటను మనం మెచ్చుకోవాల్సిందే" అని కొనియాడాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలవడం ద్వారా అత్యంత పిన్న వయస్కుడిగా కేరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అల్కరాజ్.. కుడి మణికట్టు గాయం కారణంగా మధ్యలో 4న్నర నెలల పాటు ఆటకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే ఆ విశ్రాంతి తనలో మరింత శక్తిని, ఆకలిని పెంచిందని, ప్రస్తుతం ఇండోర్ కోర్టు పరిస్థితులకు పూర్తిస్థాయిలో అలవాటు పడ్డానని అల్కరాజ్ తెలిపారు. కుడి మోకాలికి టేప్‌తో బరిలోకి దిగినప్పటికీ, ఏమాత్రం అసౌకర్యానికి గురికాకుండా అద్భుతంగా కదిలానని ఆయన పేర్కొన్నారు.

ఐసీసీ చైర్మన్‌గా జయ్ షా రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక!

- ఇండోనేషియాలోని బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో రెండో టర్మ్‌కు ఏకగ్రీవంగా ఎన్నికైన 38 ఏళ్ల జయ్ షా
- క్రీడా ప్రపంచంలో కీలక తరుణంలో కొనసాగింపు అవసరమని బోర్డు ఏకగ్రీవ నిర్ణయం; లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028 సన్నాహకాలపై ప్రధాన దృష్టి
- జయ్ షా పునరైక ఎన్నికపై హర్షం వ్యక్తం చేసిన సచిన్ తెందుల్కర్, అభినవ్ బింద్రా వంటి క్రీడా దిగ్గజాలు



బలగం టీవీ, బాలి:

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) చైర్మన్‌గా జయ్ షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండోనేషియాలోని బాలిలో ఆదివారంతో ముగిసిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో ఆయనను రెండో రెండు సంవత్సరాల టర్మ్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సోమవారం ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. ఈ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన జయ్ షా, గతంలో డిసెంబర్ 2024లో తొలిసారి ఈ బాధ్యతలు చేపట్టారు.

గ్లోబల్ విస్తరణ, ఒలింపిక్స్‌పై ప్రత్యేక దృష్టి:

"క్రికెట్‌కు ఇది అత్యంత కీలకమైన తరుణం. ప్రపంచవ్యాప్తంగా క్రీడను విస్తరించడం, అభిమానుల సంఖ్యను పెంచడం, వాణిజ్యపరమైన అభివృద్ధికి మా వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ కేంద్ర బిందువుగా ఉంటుంది" అని ఐసీసీ తెలిపింది. బోర్డు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన జయ్ షా.. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి అన్ని దేశాల సభ్యులతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028: క్రికెట్ తిరిగి ఒలింపిక్స్‌లోకి ప్రవేశిస్తుండటం కొత్త ప్రేక్షకులకు ఈ ఆటను పరిచయం చేయడానికి గొప్ప అవకాశమని ఆయన అన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి తాము సిద్ధమవుతున్నామని తెలిపారు.

దిగ్గజాల అభినందనలు:

జయ్ షా పునరేన్నికపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ హర్షం వ్యక్తం చేశారు. మహిళా క్రికెట్‌కు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని 'ఎక్స్' (X) వేదికగా అభినందించారు. అలాగే, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా స్పందిస్తూ.. LA28 ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం ద్వారా సరికొత్త తరానికి ఈ ఆటను పరిచయం చేసే గొప్ప అవకాశం లభిస్తుందని పేర్కొంటూ జయ్ షాకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంగ్లండ్, జింబాబ్వే, న్యూజిలాండ్ క్రికెట్ బోర్డులు కూడా ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉత్తర అమెరికాలో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న భారత్!

- వచ్చే ఏడాది జూలైలో వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు; 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20ల ఆల్-ఫార్మాట్ సిరీస్ నిర్వహణకు సన్నాహాలు
- ఐదు టీ20లలో రెండు మ్యాచ్‌లను ఉత్తర అమెరికాలో ఒకే వేదికపై నిర్వహించేందుకు ఐసీసీ, క్రికెట్ వెస్టిండీస్ కసరత్తు
- వేదికల రేసులో ముందున్న వాషింగ్టన్ డీసీ, టొరంటో; పరిశీలనలో 2028 ఒలింపిక్స్ వేదిక పొమోనా (లాస్ ఏంజిల్స్), ఫ్లోరిడాలోని లాడర్‌హిల్





బలగం టీవీ, న్యూఢిల్లీ:

భారత క్రికెట్ అభిమానులకు మరో ఆసక్తికర వార్త. వచ్చే ఏడాది (2027) జూలైలో జరగనున్న వెస్టిండీస్ పర్యటనలో భాగంగా భారత జట్టు ఉత్తర అమెరికాలో రెండు అంతర్జాతీయ టీ20 (T20I) మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) 2027–31 ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (FTP) ఖరారు చేసే ప్రక్రియలో భాగంగా బాలిలో జరుగుతున్న బోర్డు సమావేశాల్లో ఈ అంశంపై కీలక చర్చలు జరిగాయి.

2027 పర్యటన షెడ్యూల్ & వేదికల వివరాలు:

క్రిక్‌ఇన్ఫో (Cricinfo) నివేదిక ప్రకారం, కొత్త ఎఫ్‌టీపీ సైకిల్‌ను వెస్టిండీస్ జట్టు భారత్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రారంభించనుంది.

సిరీస్ వివరాలు: ఈ ఆల్-ఫార్మాట్ టూర్‌లో భాగంగా భారత్, వెస్టిండీస్ మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఉత్తర అమెరికాలో 2 టీ20లు: ఐదు టీ20 మ్యాచ్‌లలో రెండింటిని ఉత్తర అమెరికాలో ఒకే వేదికపై నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

పరిశీలనలో ఉన్న నగరాలు: ఈ రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చే రేసులో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ, కెనడాలోని టొరంటో ముందున్నాయి. వీటితో పాటు 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్న పొమోనా (Pomona), గతంలో పలు అంతర్జాతీయ మ్యాచ్‌లకు వేదికైన ఫ్లోరిడాలోని లాడర్‌హిల్ (Lauderhill) పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి.

రజత్ పాటిదార్ సునామీ

- 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు.. అసోంపై మధ్యప్రదేశ్ ఘన విజయం!
- గ్రూప్-సి మ్యాచ్‌లో 13 సిక్సర్లు, 8 ఫోర్లతో చెలరేగి, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున శతకం బాదిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించిన కెప్టెన్ రజత్ పాటిదార్
- మరోవైపు ఇతర మ్యాచ్‌లలో మహారాష్ట్రపై కేరళ, ఆంధ్రపై హిమాచల్ ప్రదేశ్, త్రిపురపై పుదుచ్చేరి విజయాలు



బలగం టీవీ, ముల్లాన్‌పూర్:

దేశవాళీ టీ20 టోర్నీ 'సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ' (SMAT) గ్రూప్-సి మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సోమవారం అసోంతో జరిగిన పోరులో పాటిదార్ కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు బాదడంతో మధ్యప్రదేశ్ జట్టు 131 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా పాటిదార్ సరికొత్త చరిత్ర సృష్టించాడు.

5వ స్థానంలో వచ్చి బౌలర్లను ఊచకోత కోసిన పాటిదార్:

గాయాల నిర్వహణ కారణంగా ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ నుంచి తప్పుకున్న పాటిదార్, ఈ మ్యాచ్‌లో 5వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అసోం బౌలర్లపై విరుచుకుపడ్డాడు.

కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న పాటిదార్, తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 13 భారీ సిక్సర్లు, 8 ఫోర్లు బాదాడు.

అతనికి శివాంగ్ కుమార్ (61 పరుగులు) చక్కటి సహకారం అందించడంతో మధ్యప్రదేశ్ నిర్ణిత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

అనంతరం 251 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో అసోం జట్టు 17.4 ఓవర్లలో కేవలం 119 పరుగులకే కుప్పకూలింది. మధ్యప్రదేశ్ బౌలర్లలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కుమార్ కార్తికేయ (3/17) రాణించగా, అవేష్ ఖాన్, రవి బాథమ్ తలో రెండు వికెట్లు తీశారు.

ఇతర మ్యాచ్‌ల ఫలితాలు (సంక్షిప్తంగా):

కేరళ ఘన విజయం: ముల్లాన్‌పూర్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో మహారాష్ట్రపై కేరళ 94 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. రోహన్ కున్నుమ్మల్ (75), సంజూ శాంసన్ (47) రాణించడంతో కేరళ 211/8 స్కోరు చేయగా, లక్ష్య ఛేదనలో మహారాష్ట్ర 117 పరుగులకే ఆలౌటైంది. కేరళ పేసర్ ఎండీ నిధీష్ 5 వికెట్లతో (5/27) చెలరేగాడు.

ఆంధ్రపై హిమాచల్ ప్రదేశ్ గెలుపు: మొహాలీలో జరిగిన ఉత్కంఠ పోరులో ఆంధ్ర జట్టుపై హిమాచల్ ప్రదేశ్ 8 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత హిమాచల్ 158/9 పరుగులు చేయగా, ఛేదనలో ఆంధ్ర జట్టు 150/8 పరుగుల వద్దే నిలిచిపోయింది.

త్రిపురపై పుదుచ్చేరి విజయం: మొహాలీలోనే జరిగిన మరో మ్యాచ్‌లో త్రిపురను పుదుచ్చేరి 40 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భాను ఆనంద్ (59), అమన్ ఖాన్ (69) అర్ధశతకాలతో పుదుచ్చేరి 209 పరుగులు చేయగా, త్రిపుర 169/9 పరుగులకే పరిమితమైంది. త్రిపుర బౌలర్ మణిశంకర్ మురాసింగ్ 6 వికెట్లు (6/33) తీసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- ఈ నెల 19న రూ.5 లక్షల జీవిత బీమా పథకం ప్రారంభం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బలగం టీవీ, వేములవాడ:

పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని,తెలంగాణ లో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలకు పునాది వేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో వేములవాడ అర్బన్ మండలానికి చెందిన నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో, ప్రతి గడపకు చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హులైన నిరుపేదలకు కొత్తగా 8,052 పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు తదితర అర్హులైన వర్గాలకు పింఛన్లు అందించడం ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతోందని తెలిపారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు . రేషన్ కార్డు కలిగిన అర్హులైన పేద కుటుంబాల్లో కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల జీవిత బీమా అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.

గతంలో రైతులకు మాత్రమే పరిమితమైన బీమా భరోసాను భూమిలేని నిరుపేద కుటుంబాలకు సైతం విస్తరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు . గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ పెద్దల వివరాలు సేకరించి అర్హుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.